





ఈ'సారీ' అంతే

- నిర్మలమ్మ బడ్జెట్‌లో నేతన్నకు నిరాశ
- టెక్స్‌టైల్ బడ్జెట్ రూ.4392.85 కోట్లలో మన వాటా ఎంతో?
- ఎదురుచూపులకే పరిమితమైన పవర్‌లూం క్లస్టర్
- ఇతర రంగాల కేటాయింపులపై మోదం.. ఖేదం
- నాయకుల భిన్నాభిప్రాయాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల నేతన్నలను కేంద్ర బడ్జెట్ మరో సారీ నిరాశ పర్చింది. ఎన్నికల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంగళవారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో టెక్స్‌టైల్ రంగానికి ఊతమిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. దాదాపు దశాబ్దకాలంగా సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్ కోసం ఎదురు చూస్తున్న సిరిసిల్ల మరమగ్గాల కార్మికులు ఈ సారి పార్లమెంట్‌లో ఆశాజనకంగా ఉంటుందని భావించినా టెక్స్‌టైల్ బడ్జెట్ మోదం, ఖేదంగా మారింది. 2013 కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి మెగా పవర్‌లూం క్లస్టర్ కోసం కేంద్రానికి విజ్ఞప్తులు చేయడం, స్థానిక ఎమ్మెల్యే కే తారకరామారావుతో సహా ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖలు రాయడం తప్పా మెగా పవర్‌లూం క్లస్టర్ బడ్జెట్‌లో మాత్రం చోటు దక్కించుకోలేక పోయింది. 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024 మధ్యంతర బడ్జెట్‌లో మెగా పవర్‌లూం క్లస్టర్ చోటు దక్కుతుందని ఆశించిన నిరాశేమిగిలింది. గతంలో తెలంగాణకు మెగా పవర్‌లూం క్లస్టర్ వచ్చినా వరంగల్‌కు వెళ్లిపోవడంతో సిరిసిల్ల వాసులు నిరాశ చెందారు. టెక్స్‌టైల్ బడ్జెట్‌లో కూడా సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు, ఇతర రంగాలకు వాటా ఎంత లభిస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఈ సారి కేంద్ర బడ్జెట్‌లో రూ.4392.85 కోట్లు టెక్స్‌టైల్‌కు కేటాయించారు. సిరిసిల్లకు నిధులు రాబట్టుకోవడానికి పీఎం మిత్ర స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయించిన పద్దుల్లో నుంచి రాబట్టుకునే అవకాశం ఉంది. పీఎం మిత్ర పథకానికి రూ.300 కోట్లు కేటాయించారు. ఇది కూడా చాలా తక్కువ బడ్జెట్‌గానే భావిస్తున్నారు. అంకెల గారడీలో వాటా ఎంతో తెలియకపోయినా ఉపాధి కల్పనలో టెక్స్‌టైల్ రంగానికి ప్రోత్సాహం వస్తుందా? అనే అయోమయంలో ఉన్నారు.

ఆశ..నిరాశ

కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా జిల్లాకు ఎలాంటి ప్రయోజనకరంగా లేకపోయినా ఐటీ విధానంలో మార్పులు, ఉద్యోగ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, విద్యార్థులకు వ్యవసాయ రంగాలకు ప్రయోజనకరంగా ఉందని భావిస్తున్నారు. రూ.3 లక్షల వరకు జీరో ట్యాక్స్ ఉండడంతో పాటు పలు స్లాబ్‌లు నిర్ణయించారు. వేతన జీవులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 నుంచి రూ.75 వేలకు పెంచడంతో నిరాశే కలిగింది. ఉన్నత విద్యకు రూ.10 లక్షల రుణంతో పాటు ఇంటర్న్‌షిప్‌కు రూ.5 వేలతోపాటు రూ.6 వేల ఆర్థిక సాయం అందించనుంది. మొబైల్ ఫోన్‌లు, బంగారం, వెండి, లెదర్ గూడ్స్ వంటి వాటిపై పన్ను తగ్గించడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. ఉద్యాన పంటలకు 109 కొత్త వంగడాలను విడుదల చేసింది. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలు ఇచ్చింది. ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారు. గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారు.

నిరుపేదలకు మూడు కోట్ల ఇళ్లు



- ప్రతాప రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలం. ప్రధాని ఆవాస యోజన పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణం ప్రకటన అభినందనీయం. మహిళలకు ముద్ర రుణాలు, విద్యార్థుల ఉన్నత విద్యకు అందించే రుణం పెంపు గొప్ప విషయం. నిత్యావసరాల ధరలు తగ్గించే నిర్ణయంతో సామాన్యులపై భారం తగ్గుతుంది.

బీజేపీ బడ్జెట్



- గుంటి వేణు, సీపీఐ జిల్లా కార్యదర్శి

కేంద్ర బడ్జెట్ కాదు, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోసం ప్రవేశ పెట్టిన బీజేపీ బడ్జెట్‌లా ఉంది. దక్షిణ భారతంలోని రాష్ట్రాలకు మొండి చేయి చూపింది. సిరిసిల్ల రైల్వే లైన్‌కు ఒక్క రూపాయి కూడా కేటయించలేదు. వస్త్ర పరిశ్రమపై బీజేపీ కపట ప్రేమ బయటపడింది. వ్యవసాయ సబ్సిడీలకు నిధులు కేటాయించలేదు.

తెలంగాణకు ప్రయోజనం లేదు



- సిద్ద వేణు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రయోజనం లేదు. ఇక్కడి నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నిధులు తేవడంలో విఫలమయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. అమరావతి అభివృద్ధికి రూ.1500 కోట్లు కేటాయించారు. తెలంగాణకు మొండి చేయి చూపారు.

ప్రభుత్వాలను కాపాడుకునే బడ్జెట్



- ఏనుగు మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం తమ ప్రభుత్వంతోపాటు ఆయా రాష్ట్రాల్లో మద్దతు తెలిపిన వారి కోసమే కేటాయించినట్లు తెలుస్తోంది. బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కు నిధులు వర్షం కురిపించారు. తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపారు.

ఉద్యోగుల ఆశాలపై నీళ్లు



- దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల

ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న కేంద్ర బడ్జెట్ ఉద్యోగుల ఆశాలపై నీళ్లు చల్లింది. పాత పన్ను విధానంలో మార్పులు చేయకపోవడం నిరాశ కల్గించింది. వేతన జీవులపై కొత్త పన్ను విధానాన్ని రుద్దే పరిస్థితులను కల్పించారు. అత్యధిక శాతం తక్కువ వేతనం పొందే ఉద్యోగులకు పాత పన్ను విధానం ఉపయుక్తంగా ఉంటుంది. దానిలో ఎలాంటి వెసులుబాట్లు, రాయితీలను కల్పించకపోవడం సరికాదు.

మరోసారి మొండి చేయి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణపై బీజేపీ ప్రభుత్వానికి ప్రేమ లేదని రుజువైందని, మరోసారి మొండిచేయి చూపిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ మోదీకి తెలంగాణపై ఉన్న వ్యతిరేకతను చాలా సందర్భాల్లో చూశామని, గతంలో పార్లమెంట్ తలుపులు మూసి తల్లీబిడ్డలను వేరుచేసి తల్లిని చంపారని మోదీ అన్న మాటలు తెలంగాణపై ఉన్న వ్యతిరేకత అర్థమైందని అన్నారు. తెలంగాణలోని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ప్రజలకు బడ్జెట్‌పై ఏం సమాధానం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి మోదీని, కేంద్ర మంత్రులను కలిసినా రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కేంద్రం ప్రభుత్వంపై గొంతు ఎత్తుతామని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెస్తామని అన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష



- తోట ఆగయ్య, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపింది. సిరిసిల్ల చేనేత కార్మికుల కోసం క్లస్టర్ పవర్ లూం ఏర్పాటు చేయాలని గతంలో తెలంగాణ ప్రభుత్వం విన్నవించినా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటు పట్టించుకోలేదు. పక్క రాష్ట్రంలో టీడీపీతో పొత్తుపెట్టుకున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ రాష్ట్రానికి గ్రాంట్ రూపకంగా రూ.15 వేల కోట్లు నిధులను మంజూరు చేసి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది.

అంకెల గారడీ



- చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. గత సంవత్సరం బడ్జెట్‌కు ఈ సంవత్సరం బడ్జెట్‌కు అంకెల్లో చేర్పులు మార్పులు మాత్రమే. బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణకు పూర్తిగా అన్యాయం జరిగింది. ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగేదేమీలేదు.

తెలంగాణకు అన్యాయం



- గంగం స్వరూపరాణి, మాజీ ఎంపీపీ, రుద్రంగి.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ప్రతీసారి అన్యాయం. దీంతో తెలంగాణ ప్రజలను నిరాశ పరిచింది. నిధుల కేటాయింపులో తెలంగాణను కేంద్రం చిన్నచూపు చూస్తోంది. మోదీ సర్కార్ కొత్త రాష్ట్రాన్ని పదేళ్లుగా ఎన్నడూ పట్టించు కోలేదు. ప్రతిసారీ బడ్జెట్‌లో తెలంగాణపై సవితి తల్లి ప్రేమ చూపుతున్నారు.

నేతన్నలకు నిరాశ



- కోడం రమణ, సీఐటీయూ, జిల్లా కార్యదర్శి సిరిసిల్ల

కేంద్ర బడ్జెట్ నేతన్నలకు నిరాశ మిగిల్చింది. కేంద్రంలో మూడోసారి మిత్రపక్షాలమద్దతుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఈ సారైనా వార్షిక బడ్జెట్‌ను జనరంజకంగా ప్రవేశపెడుతుందని పేదలు ఎదురు చూశారు. పవర్‌లూం క్లస్టర్‌ను సిరిసిల్లకు కేటాయిస్తారని ఆశతో ఎదురు చూస్తే నిరాశే మిగిలింది. బడ్జెట్‌ను సవరించి సిరిసిల్ల పవర్‌లూం క్లస్టర్ కేటాయించాలి.

వేతన జీవులకు నిరాశ



- పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల

బడ్జెట్ వేతన జీవులకు నిరాశ మిగిల్చింది. జాతీయ విద్యావిధానం- 2020 ప్రకారం బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరుశాతం నిధులు కేటాయించాలి. ఈ బడ్జెట్‌లో కేవలం 3.25 శాతం మాత్రమే కేటాయించారు. దశాబ్ద కాలంగా ఆదాయ పన్ను పరిమితిని ఐదులక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నా ఈ బడ్జెట్‌లోనూ పెంచలేకపోవడంతో వేతన జీవులకు నిరాశ ఎదురైంది.

జనరంజక బడ్జెట్



- అల్లాడి రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

కేంద్రం బడ్జెట్ జనరంజకమైంది. గ్రామీణాభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, ఎంఎస్ఎంఈ కుటీర పరిశ్రమలకు పెద్ద పీట వేశారు. విద్యార్థుల విదేశీ విద్యకు రూ.10 లక్షల పావలా వడ్డీరుణం, గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజల ఇంటి నిర్మాణానికి సహకారం. రైతాంగానికి మేలు చేసే బడ్జెట్. సామాన్య ప్రజలకు ఉపయోగకరంగా ఉంది.

ప్రతీ బడ్జెలో ఎదురు చూపులే



- గూడూరి ప్రవీణ్, మాజీ చైర్మన్ టెక్స్‌టైల్ కార్పొరేషన్

సిరిసిల్ల నేతన్నలకు మరోసారి నిరాశే మిగిలింది. ఈ సారి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా వస్త్ర పరిశ్రమకు ఏదైనా ప్యాకేజీ తెస్తారని భావించాం. మెగా పవర్‌లూం క్లస్టర్ కోసం ప్రతి బడ్జెట్‌లోనూ ఎదురు చూపులే. తెలం గాణ టెక్స్‌టైల్, చేనేత రంగాల అభివృద్ధిని కేంద్రం పూర్తిగా విస్మరించింది.

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

వేములవాడ టౌన్, జూలై 23 : నిరుపేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సరిగా అందక ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమ నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయన్నారు. కత్తి కనుకయ్య గాలిపెల్లి సువర్ణస్వామి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ నాయకులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్: మండలంలోని లింగంపల్లి, నమిలిగుండుపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మాజీ సర్పంచ్ సాయ కవిత తిరుపతి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, నీరటి సంజీవ్, డి.దేవయ్య, సుంకరిరెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

వీర్నపల్లి, జూలై 23 : వర్షాలు సమృద్ధిగా కురవాలని వీర్నపల్లి మండల కేంద్రంలో మహిళలు గ్రామదేవతలకు మంగళవారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుల్లతో నీళ్ల బిందెలు తీసుకొని ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, మల్లన్న, బీరప్ప, శివాలయం, రామాలయం ఆలయాల్లో విగ్రహాలకు నీటితో అభిషేకం చేశారు. శివాలయం, రామాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణాలతో శివుడు, రాముడు, ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు.



నీళ్ల బిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

వ్యవసాయ నూతన పద్ధతులపై అవగాహన

కోనరావుపేట, జూలై 23: కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో వ్యవసాయంలో నూతన పద్ధతులపై మంగళవాం అవగాహన కల్పించారు. రైతు నేస్తంలో భాగంగా చీడ పీడల యజమాన్యం అనే అంశంపై హైదరాబాద్ శాస్త్రవేత్త శ్రావణ దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. అనంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా నిజామాబాద్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకట రామమ్మ, రైతులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ

చందుర్తి జూలై 23:చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆర్డీవో రాజేశ్వర్ మంగళవారం తనిఖీ చేశారు. వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరడంతో మరొక భవనంలోకి మార్చేందుకు పరిశీలించారు. ఇట్టి భవనం హాస్టల్‌కు అనుకూలంగా ఉండడంతో వెంటనే మార్చాలని ఆర్డీవో సూచించారు. జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తర్వులు వచ్చిన వెంటనే భవనాన్ని మార్పు చేయనున్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీనివాస్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి విజయలక్ష్మి, వసతి గృహ సంక్షేమ అధికారి రవీంద్ర స్వామి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిరుపేదల చదువుకు ప్రభుత్వ ప్రోత్సాహం


వీర్నపల్లి, జూలై 23: నిరుపేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామని జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి జనార్దన్ అన్నారు. వీర్నపల్లి మండలం బావుసింగ్ నాయక్‌తండా పరిధిలోని గోన్యానాయక్ తండాకు చెందిన నిరుపేద యువతి బాదవత్ మధులత జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఇంటి పనులు చేసుకుంటోంది. దీంతో ఆమెకు అధికారులు అండగా నిలిచారు. మంగళవారం తండాలో మధులత నివాసానికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎస్టీ వెల్ఫేర్ అధికారులు ఉన్నారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు









ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీ ధ్వంసం చేసిన దొంగలు 40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.













వస్త్ర పరిశ్రమ మనుగడకు చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 23 : సిరిసిల్ల వస్త్ర పరిశ్ర మనుగడ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరిసిల్లలో చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతూ ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరు నెలలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో తొమ్మిది మంది కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. సంక్షోభ నివారణకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం మూలంగా వస్త్ర పరిశ్రమ నడవక కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటీర పరిశ్రమగా ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను బతుకమ్మ చీరల పేరుతో ఎస్ఎస్ఐ యూనిట్స్ మాక్స్ సంఘాలను పెట్టించిందని, మిగతా క్వాలిటీ గుడ్డను నడవకుండా పూర్తిగా లూమ్స్‌పై బతుకమ్మ చీరల మాత్రమే నడపాలని నిబంధన పెట్టి పాలిస్టర్, కాటన్ పరిశ్రమ మనుగడ లేకుండా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, నేతన్న బీమా, నేతన్న చేయుత, వర్క్ టూ ఓనర్ పథకాలను అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, సీపీఐ జిల్లా నాయకుడు మీసం లక్ష్మణ్, విద్యార్థి సంఘం నాయకుడు అంగూర్ రంజిత్, దళిత సంఘాల నాయకులు మంగళి చంద్రమౌళి, రాజశేఖర్, మురళి, బాలరాజు, చంద్ర పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్టుకు గండి



గండి పడి దిగువకు పోతున్న నీరు

శంకరపట్నం, జూలై 23: శంకరపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టుకు మంగళవారం గండి పడి నీరు దిగువకు పోతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరింది. మత్తడి దగ్గర కట్ట బలహీనంగా ఉండడంతో గండి పడింది. దీంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా దిగువకు పోతోంది. గత సంవత్సరం వర్షాకాలంలో ప్రాజెక్టుకు గండి పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. వేసవిలో పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టకపోవడంతో, తాత్కాలిక మరమ్మత్తులు చేసిన చోట కట్ట బలహీనపడి గండి పడింది. దీంతో కల్వల ప్రాజెక్టుపై ఆధారపడిన శంకరపట్నం, వీణవంక మండలాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.





ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 25,490 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,490 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 23.122 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 52.948 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీ రథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 532 క్యూ సెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 16.944 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.155 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 23: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్ష ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ యువకుడి మృతి

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి వద్ద రాజీవ్ రహదారిపై మంగళ వారం జరి గిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గుండ్ల శ్రీనివాస్(27) ఉదయం బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరగా, సుల్తానాబాద్ మం డలం నర్సయ్య పల్లి వద్ద లారీ ఢీకొన్నది. ఈ ప్రమా దంలో అతను తీవ్రంగా గాయపడగా సుల్తానా బాద్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అసుపత్రికి తరలించగా మృతిచెంది నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన లారీ డ్రైవర్ బండ శివ నాగేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



అతిసారం.. ప్రమాదకరం

● డయేరియాతో డీ హైడ్రేషన్ ● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

అతిసారకు కారణాలు

బ్యాక్టీరియా, వైరల్ పరాన్న జీవుల వలన అతిసార వ్యాధి వస్తుంది. ఎక్కువగా మలం, కలుషిత నీటి వలన డయేరియా సోకుతుంది. తాగడానికి, వంట చేయడానికి సురక్షితమైన నీరు వాడక పోవడం, పారిశుధ్య లోపం వ్యాధికి ప్రధాన కారణం కావచ్చు. ఐదేళ్ల కంటే తక్కువ వయసు పిల్లల్లో వైరల్ వ్యాధి కారకాలు రోట వరస్, నోరో వైరస్, అడెనో వైరస్, బ్యాక్టీరియల్ వ్యాధి కారకాలలో ఎస్చెరియా కోలి, సాల్మోనెల్లా, షిగెల్లా ఉన్నాయి.

నివారణ చర్యలు

- సురక్షితమైన తాగు నీరు ఉపయోగించడం.
- వ్యక్తిగత, ఆహార పరిశుభ్రత పాటించడం.
- సబ్బుతో చేతులు కడుక్కోవడం.
- అంటు వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం.
- రోటా వైరస్ టీకా వేసుకోవడం.
- పౌష్టికాహారం తీసుకోవడం.

వెల్గటూర్, జూలై 23: వర్షాకాలం వచ్చిందంటేనే వాతావరణ మార్పులతో పాటు సీజనల్ వ్యాధులు కూడా వ్యాపిస్తుంటాయి. బావులు, బోరు బావుల్లో కొత్త నీరు చేడంతో కలుషిత నీరు తాగడం వలన కూడా వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉంది. వర్షా కాలంలో ప్రబలే వ్యాధుల్లో అతిసార వ్యాధి ఒకటి. అతిసార వలన వాంతులు విరేచనాలు కలిగి శరీరం మొత్తం డీ హైడ్రేషన్ కావడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అతిసారం అతి ప్రమాదకరమైందని, దీని వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లకూడదంటే అప్రమత్తత చాలా అవసరమని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అత్యవసరమని పేర్కొంటున్నారు. అతిసార ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించే అవగాహన లేకపోవడంతో చిన్నారులకు ఎక్కువగా సోకుతుంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపం కూడా అతిసారం ప్రధాన కారణమని వైద్యాధికారులు అంటున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరగడం, మెరుగైన వైద్య చికిత్స విధానాలు అందుబాటులోకి రావడంతో జిల్లాలో కొన్నేళ్లుగా అతిసార మరణాలు సంభవించలేదు.

అవగాహన అవసరం

అతిసార (డయేరియా) వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. డయేరియా సోకకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం. కలుషిత ఆహారం, కలుషిత నీరు, పారిశుధ్య లోపం అతిసార వ్యాధికి ప్రధాన కారణ మని చెప్పవచ్చు. సెప్టిక్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కూడా డయేరియాకు కారణం కావచ్చు. అతిసార వ్యాధి సోకిన వారికి సుమారు పక్షం రోజుల పాటు వాంతులు, విరేచనాలు ఉంటాయి. దీనితో శరీరంలో నీరు, లవణాలు కోల్పోయి ప్రాణాలకు ముప్పు కలుగవచ్చు. పోషకాహార లోపం, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, గుండె, కిడ్నీ, షుగర్ సంబంధిత వ్యాధులు ఉన్న వారు అతిసార వ్యాధి బారిన పడే అవకాశం అధికంగా ఉంది.

డీ హైడ్రేషన్‌తో ప్రాణాలకు ముప్పు

డయేరియా సోకిన వారికి వాంతులు, విరేచనాలు కొన్ని రోజులు పాటు కొనసాగడంతో శరీరం డ్రై హైడ్రేషన్ కారణంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చు. తీవ్రమైన డీ హైడ్రేషన్ కారణంగా అపస్మారక స్థితికి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది. విరేచనాలు కావడం వలన శరీరంలో నీటితో పాటు సోడియం, పొటాషియం, క్లోరైడ్ బై కార్బోనేట్ వంటి ఎలక్ట్రోలైట్లు కోల్పోతాయి. ద్రవ మలం, వాంతులు, మూత్రం, చెమట ద్వారా శరీరం నీటిని కోల్పోతుంది. నిరంతర విరేచనాలు, మలంలో రక్తం కనిపించినపుడు లేదా డీ హైడ్రేషన్ సాంకేతాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



అతిసార వ్యాధితో పాటు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండాలంటే వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి. బయటి ప్రదేశాలకు వెళ్లి వచ్చినపుడు, మల, మూత్రాలు విసర్జించినపుడు చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. బయటి పదార్థాలు తినకూడదు. వాంతులు, విరేచనాలు అయినపుడు వైద్యులను సంప్రదించాలి. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. కొన్నేళ్లుగా జిల్లాలో డయేరియా మరణాలు లేవు. కోటి లింగాలలో డయేరియాతో మృతి చెందిన కేసు ఇటీవలే నమోదైంది.



కోటిలింగాలలో పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన కేశ సంతోష్ సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా గ్రామంలో సంతోష్ బెల్టుషాపు నిర్వహిస్తుండగా, పది రోజుల క్రితం నుంచి మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచి అమ్ముతున్నారని, దాంతో తన వద్ద ఎవరూ అంత ధర పెట్టి మద్యం కొనుగోలు చేయడం లేదని, వ్యాపారులు ధరలు తగ్గించాలని తన స్టేటస్ లో పెట్టుకున్నాడు. దీంతో మద్యం సిండి కేట్ నిర్వాహ కులు తనకు ఫోన్ చేసి బెదరించారని సంతోష్ తన సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, సిండికేట్ గురించి అబ్కారీ సీఐ రఘునాథ్‌ను అడుగగా అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో ఆస్తినష్టం

పెద్దపల్లి రూరల్, జూలై 23 : పెద్దపల్లి మండలంలోని కనగర్తికి చెందిన ఏడెల్లి పద్మకు చెందిన ఇంటిలో విద్యుదాఘాతంతో ప్రమాదం చోటుకుంది. ఫైర్ ఆఫీసర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడెల్లి పద్మ వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 4లక్షల 50 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొంది.

రైల్వే స్టేషన్లో ఒకరి మృతి

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట రైల్వే స్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బీహార్ రాష్ట్ర నలంద జిల్లా పిసిపర్‌కు చెందిన దినేష్ యాదవ్ (46) పట్టణంలోని ఓ రైస్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మంగళ వారం స్వగ్రామం వెళ్లేందుకు రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించాడు. చుట్టు పక్కల వారు లేపినా లేవక పోయే సరికి అధికారులకు తెలిపారు. వారు డాక్టర్‌ను పిలిచి పరీక్షించగా మృతి చెందాడని నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట ఉత్పత్తులకు మద్దతు ధరకు

చట్టబద్ధత కల్పించకపోవడం బాధాకరం

- దేశ వ్యాప్తంగా రైతు రుణ మాఫీని బడ్జెట్‌లో విస్మరించారు
- ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ ఊసే లేదు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తమకు వరాలు ప్రకటిస్తారని అన్నదాతలు ఆశించినప్పటికీ నిరాశకు గురిచేశారన్నారు. రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. అంబానీ, ఆదానీ లాంటి వారికి రూ. లక్షల కోట్లు రాయితీ కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరమన్నారు. తీవ్ర అప్పుల్లో కూరుకపోయిన రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి కేంద్రం రుణమాఫీ కార్యక్రమం ప్రారంభించాల్సిన అవసరముందన్నారు.

గతంలో 2008 సంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ. లక్ష రైతు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 15 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం కూడా రుణమాఫీపై ఆలోచన చేయలేదని విమర్శించారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ నిర్మాణ వ్యవహారాన్ని బడ్జెట్‌లో విస్మరించారన్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వల్ల దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశాన్ని కలిపే విధంగా సికింద్రాబాద్ - ఢిల్లీ లైన్ సుమారు వంద కిలో మీటర్ల దూరం తగ్గుతుందని, సుమారు రెండు గంటల సమయం ఆదా అయ్యే అవకాశాలున్నాయన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశం రైల్వే లైన్ కాదని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైల్వే లైన్‌పై తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్షత కాదా అని, దక్షిణ భారత దేశాన్ని బడ్జెట్‌లో విస్మరించారని విమర్శించారు. ఆంధ్రాకు సంబంధించిన అంశాలకు సుమారు రూ. 15 వేల కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేశారన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణలో ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తారని ఆశించామని ఎటువంటి ప్రస్తావన బడ్జెట్‌లో చేయలేదన్నారు. మూసి రివర్ ఫ్రంట్‌కు సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని భావించామని కేంద్రం బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషించినప్పటికీ తెలంగాణలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన స్పందన కనబడడం లేదని తెలిపారు.

స్థానిక సంస్థలు

ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

కరీంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ఆదాయాన్ని మరింత పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం కరీం నగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు-బాధ్యతలపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారుల నుంచి విధులు, బాధ్యతలు, ఆదాయం పెంచే మార్గాలపై సూచనలు సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా సానికల సంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్థానిక సంస్థల ఆర్థికంగా బలోపేతమైతేనే రాష్ట్రం, దేశం పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకు అన్ని అంశాలపై అవగాహన ఉన్న కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. అధికారుల సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందని తెలిపారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి చర్యలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధితోనే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు అప్పగించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు అద్భుతంగా పూర్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులు చేసే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తున్నామని వివరించారు. అన్ని అంశాలను చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం రమేష్, సంకెపెల్లి సుధీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూనాయక్, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, పెద్దపెల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీపీఓ రవీందర్, జెడ్పీ సీఈవో లు శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని డీఆర్డీవోలు, సీఈవోలు డీపీఓలు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రయోగాలు చేయాలి

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్

గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు కొత్త కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ సూచించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు. కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని తెలిపారు. మున్సిపాలిటీల్లో అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.



రాజయ్యకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

వసతిగృహాల్లో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు

గణేశ్‌నగర్,జూలై 23: జిల్లా బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యుత్ బిల్లుల పేరిట లక్షలాది రూపాయల అవినీతి అక్రమాలపై విచారణ జరి పించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవికి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ సం ఘం ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మానకొండూర్ బీసీ సమీకృత వసతి గృహంలో దాదాపు 40 లక్షల పైగా విద్యుత్ బిల్లుల పేరిట అధి కారులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బాధ్యులందరిపై చర్యలు తీసుకోలేదన్నారు. 2018 నుంచి 2022 వరకు విద్యుత్ బిల్లులకు కేటాయించిన నిధులపై దాని వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం వల్ల కార్యాలయంలో పని చేసే అడ్మినిస్ట్రేషన్ అధికారి తన ఇష్టారాజ్యంగా వ్యవహరించి తనకు అనుకూలంగా ఉన్న వారికి ఎక్కువ నిధులు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని బీసీ సంక్షేమ శాఖను కాపాడాలని అన్నారు.



వినతి పత్రం చూపుతున్న కెసిపేద్ది శ్రీధర్‌రాజు

ఇద్దరు చెయిన్ స్నాచర్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 23: ఒక యువకుడి మెడలోని బంగారు చెయిన్‌ను దొంగలించిన ఇద్దరు చెయిన్ స్నాచర్లను అరెస్టు చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. ఏసీపీ వివరాల ప్రకారం....

కట్టరాంపూర్‌కు చెందిన సమంత్ కోతిరాంపూర్‌లో జరుగుతున్న బోనాలలో పాల్గొని ఈ నెల 17న ఉదయం 4 గంటలకు బైక్‌పై ఒంటరిగా ఇంటికి వస్తుండగా తిరుమల్ నగర్ రోడ్ నంబరు 6 వద్ద ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి సమంత్ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయారు. బాధితుడు వెంటనే కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేప ట్టిన పోలీసులు మం గళవారం ఉజ్వల పార్క్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు లభ్యమైంది. విచారించగా చెయిన్ స్నాచింగ్ చేసిన నేరం ఒప్పుకున్నారు.

నిందితులు హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఎండీ ఫైజాన్(22), మానకొండూర్‌కు చెందిన షేక్ సాహిద్ (22) లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు గొలుసు, ద్విచక్రవాహనం స్వాధీ నం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కమాన్‌పూర్, జూలై 23 : మండలంలోని గొర్రెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ధనవునేని అనిల్(30) వృతిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ నెల 22న సాయం త్రం 4 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగి పడిపోగా గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ధనవునేని నర సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వస్త్ర పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు



సిరిసిల్లలో దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు


సిరిసిల్ల రూరల్, జూలై 23 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాములుతోపాటు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూర పాటి రమేష్ మద్దుతు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూఉపాధిలేక మరమగ్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని మండిపడ్డారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తొమ్మిది నెలలనుంచి సంక్షోభంలో కూరుకపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సంబంధించి కరెంట్ సమస్య పెను శాపంగా మారిందన్నారు. పది హెచ్‌పీల వరకు ఉచిత కరెంట్ ఇచ్చి ఆ తర్వాత వాటికి నాలుగో కేటగిరి కింద 50 శాతం సబ్సిడీ కొనసాగించాలన్నారు. బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్‌లు ఇవ్వాలన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షో భానికి బాధ్యత వహించాలన్నారు. వస్త్ర పరిశ్రమపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమర్ సిరిసిల్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధిని కల్పించే విధంగా కేంద్రం నుంచి ఆర్డర్‌లను తీసుకురావాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభంపై మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతన్న సమస్యలకు పరిష్కారానికి కృషి చేయాలని, వారి బతుకులతో రాజకీయం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ నెల 26లోగా సమస్యలను పరిష్కరించకుంటే ఇంటికో వ్యక్తి చలో హైదరాబాద్ తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యెల్దెండి దేవాదాస్, గాజుల నారాయణ, ఏనుగుల ఎల్లయ్య, సిరిసిల్ల రవీందర్, ఎక్కలదేవి జగదీష్, శ్రీగాద మైసయ్య, చేరాల అశోక్, కోడం అశోక్, బండారి అశోక్, మ్యాన సత్యనారాయణ దీక్షలో కూర్చున్నారు. మూషం రమేష్, పంతం రవి, దామోదర్, మండల సత్యం, మోర రాజు, అడెపు భాస్కర్, కుమ్మరికుంట కిషన్, గోనె పర్శరాములు పాల్గొన్నారు.

వర్షంలో భోజనాలు చేస్తూ రాస్తారోకో

రిలే నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా జేఏసీ ఆధ్వర్యంలో యజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు భోజనాలు చేస్తూ రాస్తారో చేపట్టారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ సైతం నిరసన తెలిపారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్



గణేశ్‌నగర్, జూలై 23: వినియోగ దారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా కరీంనగర్ సర్కిల్ పరిధిలో 189 కెపాసిటర్ బ్యాంకులు పెట్టినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఇంకా 12 కెపాసిటర్ బ్యాంకులు పెట్టనున్నట్లు తెలిపారు. వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయని అన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో సబ్‌స్టేషన్, లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. సబ్ స్టేషన్‌లలో, అలాగే 11కెవి లైన్లలో కెపాసిటర్లు అమర్చడం వలన పవర్‌ఫాక్టర్ మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకు లోవోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతాయన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గుతాయన్నారు. పరికరాల మన్నిక చాలాకాలం పెరుగుతుందన్నారు. పారిశ్రా మిక వినియోగదారులకు కెపాసిటర్లు పెట్టు కోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు. వీటి వలన ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తగ్గి మోటార్లు కాలిపోకుండా మన్నిక పెరుగుతుందని తెలిపారు.

బస్టాండ్‌ను పరిశీలించిన డిపో మేనేజర్



పరిశీలిస్తున్న డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు

గంభీరావుపేట, జూలై 23 : గంభీరావుపేట ప్రయాణ ప్రాంగాణాన్ని సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు మంగళవారం పరిశీలించారు. ప్రయాణ ప్రాంగణంలో వసతులపై ప్రయాణికులకు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీసీ రాంరెడ్డి, కండాక్టర్ విజయ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శీత్లా భవాని వేడుకలు

వీర్నపల్లి, జూలై 23: వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామ పరిధిలోని బంగిరెడ్డి తండాలో శీత్లా భవాని వేడుకలను గిరిజనులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్య దైవం శీత్లా భవాని దేవికి బోనాలు సమర్పించారు. వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు.

గంభీరావుపేటలో ఆషాఢం బోనాలు



బోనాలతో తరలివచ్చిన మహిళలు

గంభీరావుపేట, జూలై 22 : గంభీరావుపేట మండల కేంద్రంలో మహంకాళమ్మ ఆషాఢం బోనాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పూసల సంఘం ఆధ్వర్యంలో బోనాలు చేపట్టారు. ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పూసల సంఘం అధ్యక్షుడు ముద్రకోల అంజనేయులు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మకు బోనాలు

తంగళ్లపల్లి, జూలై 23: తంగళ్లపల్లి మండల కేంద్రంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా కట్టమైసమ్మకు బోనాలు సమర్పించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, సభ్యుడు గజభీంకార్ రాజన్న మాట్లాడుతూ సమాజ హితం కోసం ఏటా బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇల్లంతకుంట ఎంపీడీవోగా శశికళ

ఇల్లంతకుంట, జూలై 23: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శశికళను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాసమూర్తిని కొనరావుపేటకు బదిలీ చేశారు. కోనరావుపేటలో పని చేసిన శశికళ ఇల్లంతకుంటకు బదిలీపై వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసిన ఎంపీవో ఆరీఫ్, సూపరింటెండెంట్ వినోద్, టైపిస్టు సుహ, మిషన్ భగీరథ ఇన్‌ఫ్రా ఏఈ అభిషేక్ తదితరులు బదిలీ అయ్యారు.

దోమల నివారణకు చర్యలు

ఎల్లారెడ్డిపేట, జూలై 23: వర్షా కాలం నేపథ్యంలో దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పంచాయతీ కార్మికులతో మంగళవారం దోమల నివారణ మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆయన మాట్లాడుతూ చెత్తాచెదారాన్ని రోడ్లపై పడవేయకుండా జీపీ ట్రాక్టర్‌కు అందించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, జూలై 23: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ పృథ్వీధర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అక్కపల్లి, దుమాల గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గంగాధర శాకంబరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఇల్లంతకుంట, జూలై 23: మండల కేంద్రంలోని గంగాధర ఆలయంలో శాకంబరీ అలంకరణలో దేవీ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ అర్చకులు మూగు నాగరాజుశర్మ పాల్గొన్నారు.

పట్టు తప్పితే ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, జూలై 23: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పాఠశాల సమయం ముగిసిన అనంతరం బడి గేట్‌పై నుంచి తరగతి గది భవనాల పైకి ఎక్కుతున్నారు. సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు పంపిన ఉపాధ్యాయులు పాఠశాల గేట్‌కు తాళం వేయడం మర్చిపోవడంతో అక్కడే ఉన్న పిల్లలు ప్రమాదపు అంచున భవనంపైకి ఎక్కి ఆటలు ఆడుతున్నారు. పట్టు తప్పితే ప్రమాదం సంభవించే అవకాశముందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల గేటుకు తాళం వేయాలని కోరుతున్నారు.

మండల పరిషత్‌లో బదిలీలు

తంగళ్లపల్లి, జూలై 23: తంగళ్లపల్లి మండల పరిషత్‌లో ఎంపీవో జోగం రాజు ఎల్లారెడ్డిపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోనరావుపేట మండల పరిషత్ ఎంపీవో మీర్జా తంగళ్లపల్లికి వచ్చారు. మీర్జా తంగళ్లపల్లి ఎంపీవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తంగళ్లపల్లి మండల పరిషత్‌లో ఎంపీడీవో మినహా సిబ్బంది మొత్తం బదిలీ అయ్యారు.గతంలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండగా ప్రస్తుతం బదిలీల్లో ఆస్థానం కూడా భర్తీ అయ్యింది.

మందు బాబులకు జరిమానా

తంగళ్లపల్లి, జూలై 23: మందుబాబులతో, పేకాటరాయుళ్లకు కోర్టు జరిమానా విధించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. తంగళ్లపల్లి మండలంలో గతంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మంది, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 9 మంది, పేకాట ఆడిన ముగ్గురిని మంగళవారం సిరిసిల్ల జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచినట్లు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉదయశ్రీ వారందరికీ జరిమానా విధించినట్లు తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ముస్తాబాద్, జూలై 23 : ముస్తాబాద్ మండల కేంద్రంలో కేటీఆర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శీలం స్వామి, దీలీప్, నారాయణ, జహంగీర్, అనిల్, శంకర్ కిషన్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, జూలై 23: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎస్టీ మైనార్టీ, బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వచ్చే నెల 5,6 తేదీల్లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జన గణనలో బీసీల కుల గణన చేయాలని, దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని, బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని, ప్రమోషన్లలో బీసీ రిజర్వేషన్‌ను వర్తింపచేయాలని, బడ్జెట్‌లో బీసీలకు 20లక్షల కోట్లు కెటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో బీసీలు ఏడు శాతం కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడంలేదన్నారు. బీసీ బిల్లుకు మద్దతు అన్ని రాజకీయ పార్టీలు తెలపాలని, మద్దతు తెలుపని ప్రభుత్వాలను గద్దె దింపుతామని హెచ్చరించారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై 23: విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల ఛేదనకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలన్నారు. సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల ఫిర్యాదులు స్వీకరించి జాప్యం చేయకుండా వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రతీరోజు పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు. డీఎస్పీ, సీఐలు కేసులపై సమీక్షించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి క్రయ, విక్రయాలు, అక్రమ రవాణాపై నిఘా తీవ్రతరం చేయాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకమని, వాటి ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో 100మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార, వాణిజ్య సంస్థల్లో సీసీ కెమెరాలు ఉండాలన్నారు. సీసీ కెమెరాలు లేకుండా సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళికృష్ణ, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీలత, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగుల బదిలీలు ఆపాలి

వేములవాడ కల్చరల్, జూలై 23: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలని ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, రాంచందు నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు నేతృత్వంలో ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్ వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ ఉద్యోగుల బదిలీలు చేయవద్దని, ఆలయ అడ్మినిస్ట్రేషన్ ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలయ ఉద్యోగుల బదిలీలపై పునరాలోచన చేయాలని కోరారు. సూపరింటెండెంట్ నటరాజు, నాగుల మహేష్, గుండి నర్సింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ, సురేష్, గడ్డం రాజేందర్, నక్క తిరుపతి తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ విప్‌లను కలిసిన రాజన్న ఆలయ ఉద్యోగులు

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి

చందుర్తి, జూలై 23: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో 16 స్థానాల్లో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఏం జరిగిందో ప్రజలు ఆలోచించాలన్నారు. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కు దక్కిన నిధులను చూసైనా తెలంగాణ ప్రజలు ప్రశ్నించాలన్నారు. ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో మరోసారి ఈ ఘటన రుజువు చేసిందన్నారు. పార్లమెంట్‌లో కూర్చున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉంటే కేంద్రం వ్యతిరేక వైఖరిని ప్రశ్నించే వారన్నారు. తెలంగాణ రాష్ట్ర డిమాండ్లను మాత్రం పట్టించుకోలేదన్నారు. రూ.48,21,000 కోట్లతో బడ్జెట్ పెట్టినా కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారన్నారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మరొకసారి దక్కింది గుండు సున్నాయేన్నారు. ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదన్నారు. పార్టీలకు అతీతంగా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు తీసుకురావాలని కోరారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 23: నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలను పెంచి పరీక్షలను నిర్వహించాలన్నారు. రూ.4 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అటెండర్, స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, ఏటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్ అధికారులను వినతి పత్రం అందజేశారు. నాయకులు దయాకర్‌రెడ్డి, అనూష్, కుమార్‌యాదవ్, బాలకిషన్, సురేశ్, ఎలేందర్, చందు, ప్రకాశ్, చరణ్, నవీన్‌నాయక్, పవన్, నవీన్, శ్రీకాంత్, సాయి, బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌లు విడుదల చేయకపోతే కలెక్టరేట్ ముట్టడి

సిరిసిల్ల టౌన్, జూలై 23 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడదల చేయకపోతే ఆగస్టు 5న బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పభుత్వం ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేష్, రుద్రవేణి సుజిత్, వావిలాల సాయి, శ్రీనివాస్, రోహిత్, సాయి, హర్షిత్, సంపత్, అభిషేక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్

ధరణి రద్దు చేసి భూ సమస్యలు పరిష్కరించాలి

పెగడపల్లి, జులై 23 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి వెబ్సైట్‌ను రద్దు చేసి భూసమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓ రుగంటి భార్గవ్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెగడపల్లి మండల కేం ద్రంలో ఆ సంఘం నాయకులతో కలసి భార్గవ్‌రామ్ విలేఖరులతో మాట్లాడు తూ ధరణిని బొంద పెట్టి పిండం పెట్టాలని అప్పుడే భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత భూసమస్యలకు కారకుడయ్యాడంటూ , వీఆర్ఓలతో పరిష్కారమయ్యే సమస్యను కలెక్టర్లకు అప్పగించి రైతులను గోస పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాయకుల కోసం కొ త్తగా రెవెన్యూ చట్టాలు తెస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తు న్నా రని, ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేద న్నారు. ఇప్పటికైనా ధరణిని రద్దు చేసి భూసమస్యలు పరిష్కారానికి చర్యలు చే పట్టాలని లేని యెడల బీసీ సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు భా ర్గవ్‌రామ్ పేర్కొన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు తిరుపతి, రాజ య్య, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : 'ధరణి' అనే పోర్టల్‌ను తక్షణమే రద్దు చేసి 'భూమాత'ను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవ రామ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోస మంటూ 'ధరణి' అనే పోర్టల్‌ను అమలు చేసి బహుజన వర్గాల రైతుల భూస మస్యలను మరింత పెంచేసి రైతుల ఉసురు తీసుకున్నారని విమర్శించారు. ధర ణి అనే పోర్టల్ వచ్చిన నాటి నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల భూ యజమానులకు మరిన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం నూతనంగా అమలు చేయనున్న భూమాత అనే పోర్టల్‌ను వెంటనే అమలు చేసి భూసమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న భార్గవ్‌రామ్

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

వేములవాడ టౌన్, జూలై 23 : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఒకే సారి పంట రుణం రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మూడు విడతల్లో చేస్తామని చెబుతున్నారని అన్నారు. రుణమాఫీ గుర్తొచ్చి మొదలు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ మొదటి విడుతలో రూ.6098 కోట్లు లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నామని అంకెల గారడీతో రైతులను మోసం చేస్తున్నందున ప్రజల తరఫున కొట్లాడుతామన్నారు. వేములవాడ నియోజకవర్గంలో మొదటి విడుత లక్ష రుణమాఫీలో కనీసం 50 శాతం మంది రైతులకు కాలేదని, సహకార సంఘం పరిధిలోని రుణమాఫీ వివరాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వాటి మేరకే 550 మంది రైతుల్లో కేవలం 138 మందికి వర్తించిందన్నారు. ఒక్క సంఘంలోనే 420 మందికి రైతు రుణమాఫీ కాలేదన్నారు. రైతు రుణమాఫీ పేరుతో మోసం చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. నాపంల్లి పరిధిలోని 413 మంది రైతులకు 150 మందికి మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. రుణ మాఫీ పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద లెక్కలు ఉండగా దరఖాస్తుల పేరుతో కాలయాపన చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మండల అధ్యక్షుడు గొస్కుల రవి, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు నాయకులు మ్యాకల రవి, చంద్రయ్య నరేందర్, ఏశ తిరుపతి, ఈర్లపల్లి రాజు, వెంగల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బదిలీ

వేములవాడ టౌన్, జూలై 23 : వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేష్‌రావు బదిలీ య్యారు. ఫ్యామిలీ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై వెళ్లగా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సంతోష్ చారికి బాధ్యతలు అప్పగించారు. ఏరియా ఆస్పత్రి వైద్యురాలు స్వాతి జగిత్యాలకు, అనస్తీషయన్ తిరుపతి కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వేములవాడ ఏరియా ఆసుపత్రికి డాక్టర్ రాజశ్రీనీ బదిలీ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కోనరావుపేట, జూలై 23: కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఏకకాలంలో పంట రుణమాఫీపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. రైతులు, కాంగ్రెస్ నాయకులు కొమ్ము బాబు, జింక శ్రీనివాస్, శంకర్, గణేష్, రామచంద్రం, సింగం నారాయణ, పుల్కం మల్లేశం, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ శిలా శాసనం రక్షణపై నిర్లక్ష్యం



శిలా శాసనం చుట్టూ పగిలిన అద్దాలు

వేములవాడ కల్చరల్, జూలై 23: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ విశిష్టతను తెలుపుతూ ఆలయంలో ఏర్పాటు చేసిన శిలా శాసనంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో దక్షిణమూర్తి ఆలయం పక్కన రెండు శాసనాలు ఉన్నాయి. వర్షానికి తడిస్తే శిలాశాసనంపై అక్షరాలు కనుమరుగు అవుతాయని వాటి చుట్టూ అధికారులు అద్దాలను ఏర్పాటు చేశారు. అద్దాలు పగిలిపోయి భక్తులను వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు శాసనాన్ని భద్ర పర్చాలని భక్తులు, పట్టణవాసులు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

వేములవాడ టౌన్, జూలై 23 : వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అక్రమ వెంచర్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్న ఫిర్యాదుతో సోమవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేములవాడ పట్టణ, మండల పరిధిలోని అనుమతి లేని అక్రమ వెంచర్లకు గజానికి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు అధికారులు తనిఖీలు చేసి పలు రికార్డులను స్వాధీనం చేసుకోవడంతో పట్టణంలో మంగళవారం చర్చనీయాంశంగా మారింది.

వేములవాడవాసికి డాక్టరేట్

వేములవాడ టౌన్, జూలై 23 : వేములవాడకు చెందిన వీరగోని చైతన్యగౌడ్ ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ అందుకున్నారు. చైతన్యగౌడ్ చందుర్తి మండలం ఎన్గల్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ 'విక్రాంత భారతం సుసంహిత భారత రూపకద్వయస్యతులనాత్మ అధ్యయనం' అనే అంశంపై ఓయూ సంస్కృత విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో డాక్టరేట్ పూర్తి చేసినట్లు చెప్పారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎంఏ సంస్కృతం తెలుగు పట్టా సాధించడమే కాకుండా ఎంఫిల్ పూర్తి చేశానని, నేడు పీహెచ్‌డీ సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా చైతన్యకు పలువురు అభినందనలు తెలిపారు.

రోడ్డు పనులతో ప్రజలకు ఇబ్బందులు

వీర్నపల్లి, జూలై 23: వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులతో కాలనీవాసులకు ఇబ్బందులు బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జల ప్రశాంత్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సీసీరోడ్డు పక్కన గుంతలు ఉండడంతో నడిచేందుకు కష్టమవుతోందని, సంబంధిత కాంట్రాక్టరు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టర్‌ల ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట, జూలై 23: తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న ఫొటో ఎక్స్ పో' పోస్టర్‌లను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్రముఖ వైద్యులు సత్యనారాయణస్వామి, అభినయ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వైద్యులను సన్మానించారు. ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అజిమొద్దీన్, ఉపాధ్యక్షులు కుబేర స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతియాదవ్, కోశాధికారి శ్రీధర్, సలహాదారులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ ఎక్స్పో కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మెన శ్రీనివాస్, కార్యదర్శి సందెల నరేష్, సభ్యులు ఎండీ అజ్జు, సుధాకర్, సాగర్, ప్రశాంత్, వేణు, నాగరాజు, విజయ్, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూలై 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పోతు లక్ష్మీ, దర్ర మహేశ్ కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పర్శరాములు, నర్సింలు, సందీప్, సల్మాన్ ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక, సోమారంపేట గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి మంగళవారం పరామర్శించారు. రేపాకకు చెందిన మూడపెల్లి హన్మంతు, సోమారంపేటకు చెందిన బండి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. కార్యక్రమంలో గైని శ్రీనివాస్ అనీల్, పర్శరాం, శ్రీనివాస్,శివ, కోటి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని చిప్పలిపెల్లిలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జంగ బాపిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయ రావు, బొప్ప విష్ణు, పెద్దమ్మల శ్రీను, నాయకులు ఉన్నారు.

ఒంటరి వృద్ధులకు బియ్యం పంపిణీ

బోయినపల్లి, జూలై 23: బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో ఒంటరి వృద్ధులకు మండల బీజేవైఎం అధ్యక్షుడు కొనుకటి హరీష్ మంగళవారం బియ్యం పంపిణీ చేశారు. 25 కిలోల బియ్యంతోపాటు గోధుమపిండి, మంచి నూనె ప్యాకెట్లను అందజేసినట్లు తెలిపారు.

ఏకలవ్య రెసిడెన్షియల్ భూమిని రక్షించండి

కోనరావుపేట, జూలై 23: మండలంలోని మరిమడ్ల ఏకలవ్య రెసిడెన్షియల్‌కు చెందిన భూమిని రక్షించాలని సబ్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మరిమడ్ల గ్రామంలో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్‌ను 2006లో ఏర్పాటు సమయంలో 53 ఎకరాల భూమిని కేటాయించారని, కాలక్రమేనా భూమి 11 ఎకరాల 22 గుంటలు మాత్రమే మిగిలిందని అన్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవడంతో అసంపూర్తిగా ఉందన్నారు. విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. పాఠశాలకు అనుకొని అటవీ ప్రాంతం ఉండడంతో, విద్యార్థులకు భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. కబ్జాకు గురైన పాఠశాల భూమిని కాపాడి, వెంటనే అధికారులు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట గంగాధర్, ప్రకాష్, రాకేష్ తదితరులు ఉన్నారు.